ప్రజాశక్తి

సోమవారం 7 ఆగస్టు 2023 | 5 | విజయనగరం



ఎపిఎన్‌జిఒ అసోసియేషన్
రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 21, 22వ తేదీల్లో జరిగే ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.శ్రీనివాసరావు, ఎం.గంగాప్రసాదరావు కోరారు. ఈ మేరకు మహాసభ పోస్టర్‌ను ఆదివారం స్థానిక నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎం.శ్రీను, సహాయ కార్యదర్శి బి.పైడితల్లమ్మ, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.సూరిబాబు, పట్టణ అధ్యక్షులు ఎం.మంగరాజు, పట్టణ కార్యదర్శి గంగి రమేష్, పట్టణ కోశాధికారి జి.అప్పారావు, జి.మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

ఆందోళనబాటలో ఫెర్రో కార్మికులు



చీపురుపల్లి ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు (ఫైల్)

- విద్యుత్తు భారాన్ని తగ్గించాలంటూ నేడు కలెక్టరేట్ల వద్ద ధర్నా
- ప్రభుత్వం దిగిరాకపోతే నిరసన దీక్షలు, చలో విజయవాడకు కార్యాచరణ

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

రాష్ట్రంలోని ఫెర్రో ఎల్లాయిస్ కార్మికులు ఆందోళన బాటపడుతున్నారు. నిన్నమొన్నటి వరకు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించిన విషయం విదితమే. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఫెర్రో ఎల్లాయిస్ కార్మికులంతా సంఘటితమై ఈ నెల ఒకటో తేదిన విజయనగరంలో కలుసుకున్నారు. సిఐటియు ఆధ్వర్యాన ఎపి స్టేట్ ఫెర్రో ఎల్లాయిస్ వర్కర్స్ కో-ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. పరిశ్రమల పరిరక్షణకు స్పష్టమైన డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచినప్పటికీ స్పందించక పోవడం వల్ల ప్రత్యక్ష ఆందోళనల కోసం కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా ఈనెల 7న అన్ని కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేపట్టనున్నారు. అప్పటికీ స్పందించకపోతే వారం రోజులపాటు నిరసన దీక్షలు చేపట్టేందుకు, అనంతరం ఆగస్టు చివరి వారంలో చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు.

రాష్ట్రంలో 36 ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలుంటే, అందులో విజయనగరం జిల్లాలోనే 21 పరిశ్రమలు ఉన్నాయి. వాటిలో ప్రత్యక్షంగా 60 వేలు, పరోక్షంగా 6 లక్షల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. సుమారు రూ.వెయ్యి కోట్ల మేర జిఎస్‌టి రూపంలో ప్రభుత్వానికి ఆదాయం వస్తోంది. ఫెర్రో పరిశ్రమల నడకకు విద్యుత్తు వినియోగం చాలా ఎక్కువ. మొత్తం ఉత్పత్తికి అయ్యే ఖర్చులో సగం విద్యుత్తు ఛార్జీలకే చెల్లించాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో గతంలో చాలాసార్లు విద్యుత్తు ఛార్జీలు పెంచినప్పటికీ ఫెర్రో పరిశ్రమలకు మినహాయింపు ఉండేది. కేంద్ర ప్రభుత్వ సంస్కరణల్లో భాగంగా ఇటీవల విద్యుత్తు ఛార్జీలను రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. కార్మికుల ఉద్యోగ, ఉపాధికి ముప్పులేకుండా ఉండాలంటే ఛార్జీల పెంపులో ఫెర్రో పరిశ్రమలకు మినహాయింపు ఇవ్వాలంటూ విద్యుత్తు రెగ్యులేటరీ కమిటీ సమావేశంలో సిఐటియు నాయకులు డిమాండ్ చేసినా వినిపించుకోలేదు. ఈ నేపథ్యంలో మార్చి 31 వరకు ఈ పరిశ్రమలకు యూనిట్ విద్యుత్ ఛార్జీ రూ.4.95 ఉండగా, ఏప్రిల్ ఒకటో తేది నుంచి రూ.8.55కు పెరిగింది. భారం తట్టుకోలేని యాజమాన్యాలు మూసివేతకు సిద్ధమౌతున్నాయి. పెంచిన విద్యుత్తు ఛార్జీల వల్ల ఇప్పటికే విజయనగరం జిల్లాలో బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో 5, గరివిడి ప్రాంతంలో 3, కొత్తవలస ప్రాంతంలో ఒక పరిశ్రమ ఇప్పటికే మూతపడ్డాయి. గరివిడి ఫేకర్‌లో ఐదు యూనిట్లకుగాను ఒక యూనిట్ తగ్గించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి. మూసివేయడం లేదా, పరిశ్రమల్లో ఉత్పత్తిని తగ్గించడం వంటి పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే ప్రభుత్వ వైఖరి వల్ల జ్యూట్, చక్కెర ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. ఫలితంగా సుమారు 50 వేల కుటుంబాలు జీవనోపాధి కోల్పోయాయి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వంపై ఒత్తిడి చేసి ఫెర్రో పరిశ్రమలను కాపాడాల్సిన మంత్రి బొత్స సత్యనారాయణ.. 'లాభాలు వచ్చినప్పుడు ఎవరికైనా ఇచ్చారా?' అంటూ వ్యాఖ్యానించడం పట్ల యాజమాన్యాలు మండిపడుతున్నాయి. చిత్తశుద్ధి ఉంటే యాజమాన్యాలకు నిర్దిష్టమైన భరోసా ఇవ్వాలని అంటున్నాయి.

జార్ఖండ్‌లో రూ.4కే విద్యుత్తు

వాస్తవానికి విద్యుత్తు ఛార్జీలను పెంచాల్సిన అవసరం లేదు. జార్ఖండ్ తదితర రాష్ట్రాల్లో ఫెర్రో పరిశ్రమలకు అక్కడి ప్రభుత్వాలు యూనిట్‌కు రూ.4 మాత్రమే వసూలు చేస్తున్నాయి. ఖతార్ తదితర దేశాల్లో రూ.3 చొప్పున విద్యుత్తు సరఫరా జరుగుతోంది. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం, కేంద్రంలోని బిజెపి చేపట్టిన సంస్కరణలను రాష్ట్రం అమలుకు పూనుకోవడం వల్లే ఈ సమస్య ఉత్పన్నమౌతోంది. ఇటువంటి చర్యల వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దెబ్బతింటున్నాయి. విద్యుత్తు ఛార్జీల పెంపును ప్రభుత్వం విరమించుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం.

\- సిహెచ్ నర్సింగరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

విజయనగరం రైల్వేస్టేషన్‌కు
ఆధునిక హంగులు

వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ప్రధాని

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం రైల్వేస్టేషన్ త్వరలోనే ఆధునిక హంగులు, అధునాతన సౌకర్యాలతో మోడల్ స్టేషన్‌గా రూపాంతరం చెందనుందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా దేశంలోని 508 రైల్వే స్టేషన్ల పునారాభివృద్ధికి వర్చువల్ విధానంలో ప్రధాని నరేంద్ర మోడి ఆదివారం శంకుస్థాపన చేశారు. వీటిలో విజయనగరం రైల్వే స్టేషన్ ఒకటి. ఈ కార్యక్రమాన్ని విజయనగరం రైల్వే స్టేషన్ నుంచి కోలగట్ల, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు ముఖ్య అతిథులుగా వీక్షించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ అభివృద్ధి అనేది ఒక రోజులోనో.. నెల రోజుల్లోనో జరిగేది కాదని, నిరంతర ప్రక్రియని చెప్పారు. మోడల్ స్టేషన్‌తో ప్రయాణికులకు అధునాతన సౌకర్యాలు కలుగుతాయని వివరించారు. విద్యార్థులకు రైల్వే అధికారులు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న కోలగట్ల, పెనుమత్స



నెల్లిమర్ల మండలం కొత్తపేటలో సైకిల్‌యాత్ర బృందానికి వాటర్ ప్యాకెట్లు పంచుతున్న గ్రామస్తులు

చంద్రబాబు క్షమాపణ చెప్పాలి

జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పుంగనూరు ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని, పోలీస్ శాఖకు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు క్షమాపణ చెప్పాలని జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా పరిషత్తు ఛైర్మన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టుల పర్యటన పేరుతో రాష్ట్రంలో అల్లర్లు సృష్టించాలని చూడటం సరైన పద్ధతి కాదన్నారు. పోలీసులపై టిడిపి కార్యకర్తలను ప్రేరేపించి, దాడులకు తెగబడటం దారుణమన్నారు. చంద్రబాబు కుమారుడు చేస్తున్న యాత్రకు ప్రజల్లో స్పందన కరువైన నేపథ్యంలో అసహనానికి లోనై, అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబునాయుడు, ఆయన తనయుడు, ఇతర ప్రతిపక్ష నాయకులు... ముఖ్యమంత్రి పట్ల నిత్యం అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. ఈ నెలలో విజయనగరం జిల్లాలో ప్రాజెక్టుల సందర్శనకు విచ్చేస్తున్న ఆయన జిల్లాలో అన్ని తానే చేశానని చెబుతారని, అలాంటి ప్రకటనలను జిల్లా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని తెలిపారు. జిల్లాకు ఏమి చేశారో చెప్పి పర్యటన చేయాలని చంద్రబాబుకు హితవుపలికారు.

బొత్సా.. నోరు జారొద్దు

టిడిపి నాయకులు కిమిడి నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరం కోట

మంత్రి బొత్స సత్యనారాయణ పదేపదే నోరు జారడం ఆయన స్థాయిని దిగజార్చుకోవడమేనని టిడిపి విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున వ్యాఖ్యానించారు. ఆదివారం స్థానిక అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పుంగనూరులో చంద్రబాబుపై దాడులు ఏ విధంగా ఉన్నాయో సభ్యసమాజమంతా చూసిందన్నారు. కానీ బొత్స సత్యనారాయణ ప్రకటన మాత్రం చాలా దుర్మార్గంగా ఉందన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి ఏదో అమాయకులు, అక్కడికి వెళ్లి చంద్రబాబు రెచ్చగొట్టినట్లుగా మాట్లాడడం దారుణమన్నారు. పెద్దిరెడ్డి రాజకీయాలు ఎలా చేస్తారో అందరికీ తెలుసునన్నారు. నోటికి ఏదొస్తే అది మాట్లాడటం పద్ధతి కాదని, మంచి చెడు, గౌరవ మర్యాదలు ఉంటాయని, వాటిని దృష్టిలో పెట్టుకొని ఎవరిపై అయినా మాట్లాడాలని బొత్సకు హితవుపలికారు. సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు పాల్గొన్నారు.

సైకిల్‌యాత్రకు నీరాజనం

250 కిలోమీటర్లు పూర్తి ● విద్యార్థులను ఎక్కడికక్కడ ఆదరిస్తున్న ప్రజలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

జిల్లాలో విద్యారంగ అభివృద్ధి కోసం ఎస్‌ఎఫ్ఐ చేపట్టిన విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్రకు అపూర్వ ఆదరణ లభిస్తోంది. ఏడోరోజు ఆదివారం సైకిల్‌యాత్ర 250 కిలోమీటర్లు పూర్తిచేసుకుంది. ఎక్కడికక్కడ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి విద్యార్థులను ఆదరిస్తున్నారు. సహాయ సహకారాలు అందిస్తున్నారు. రామతీర్థం, సతివాడ, బొప్పడాం మీదుగా పూసపాటిరేగ మండలంలోకి యాత్ర ప్రవేశించింది. శనివారం రాత్రి స్థానిక హాస్టళ్లను ఎస్‌ఎఫ్ఐ నాయకులు సందర్శించి, విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. ఆదివారం ఉదయం రామతీర్థం జంక్షన్ నుంచి సైకిల్ యాత్ర బయల్దేరింది. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ వెంకటేష్, పి.రామ్మోహన్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా యాత్ర సాగుతుందని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని కోరారు. నెల్లిమర్లలో హాస్టల్ విద్యార్థులు అధికంగా ఉంటారని, మెస్‌ఛార్జీలు పెంచాలని డిమాండ్‌చేశారు. మండలంలో మూసేసిన ప్రాథమిక పాఠశాలలను తక్షణమే తెరిపించాలని డిమాండ్ చేశారు. జిఒ నంబర్ 77 రద్దు చేసి పీజీ విద్యార్థులకు కూడా స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అమ్మఒడి, విద్యాదీవెన నిధులు ఎటువంటి షరతులు లేకుండా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించకుంటే విద్యార్థి సంగ్రామ యాత్ర సమరయాత్రగా మారుతుందని హెచ్చరించారు.



నెల్లిమర్ల నుంచి బయల్దేరిన ఎస్‌ఎఫ్ఐ సైకిల్‌యాత్ర

వైఎస్‌ఆర్ నగర్ అభివృద్ధికి చర్యలు

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 50వ డివిజన్ పరిధి వైఎస్‌ఆర్ నగర్‌లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి తెలిపారు. ఆదివారం వైఎస్‌ఆర్ నగర్‌లో సుమారు రూ. 55 లక్షల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులకు కోలగట్ల, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో గతంలో రూ.1.50 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. అదనంగా మరో రూ.70 లక్షలు కూడా మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయయాదవ్, కార్పొరేటర్ పి.ఆదిలక్ష్మి, జోనల్ ఇన్‌ఛార్జి ముచ్చు శ్రీను యాదవ్ పాల్గొన్నారు.

రక్తదాతలు.. ప్రాణదాతలు : కోలగట్ల

ఆపద సమయంలో ప్రాణాలను నిలిపే రక్తదాతలు అభినందనీయులని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయనగరం తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. మంచి కార్యక్రమం తలపెట్టారని తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావుతోపాటు అధికారులను, ఉద్యోగులను అభినందించారు. రక్తదానానికి ముందుకొచ్చిన దాతలను ప్రశంసిస్తూ పండ్లు పంచిపెట్టారు.

11వ డివిజన్‌లో గడపగడపకు..

విజయనగరం టౌన్ : నగరంలోని 11వ డివిజన్ కాటవీధిలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మేయర్ విజయలక్ష్మి, జోనల్ ఇన్‌ఛార్జి కోలగట్ల కృష్ణారావు ఇంటింటికి వెళ్లి లబ్ధిదారుల వివరాలతో కూడిన బుక్‌లెట్లను అందజేశారు. స్థానిక సమస్యల పైన ఆరా తీశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు వెంపడాపు శ్రీనివాసరావు, అప్పారావు, సహాయ కమిషనర్ ప్రసాదరావు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల
సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు పోరాటం

సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి సురేష్



ర్యాలీ నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరణ కోసం పోరాటానికి సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్ పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంఘం విజయనగరం మండల రెండో మహాసభ స్థానిక ఎన్‌పిఆర్ భవనంలో ఆదివారం జరిగింది. తొలుత కలెక్టరేట్ నుంచి ఎన్‌పిఆర్ భవనం వరకు కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సంఘం నాయకులు కె.త్రినాథ్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నిధులు జగనన్న పథకాలకు ప్రభుత్వం దారిమళ్లిస్తోందన్నారు. దీంతో అనేకమంది మరణించిన భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు పరిహారం ఇవ్వడం లేదన్నారు. వైసిపి అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని సిఎం జగన్ హామీనిచ్చి విస్మరించారని విమర్శించారు. సంక్షేమ బోర్డు నిధులు దారిమళ్లించే ప్రయత్నం ఆపాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి బి.రమణ నివేదిక ప్రవేశ పెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇసుక అందుబాటులోకి తేవాలని, భవన నిర్మాణానికి అవసరమైన ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. మహాసభలో సంఘం గౌరవ అధ్యక్షులు రెడ్డి శంకరరావు, సిఐటియు నగర అధ్యక్షులు జగన్‌మోహన్, పెయింటర్ల సంఘం జిల్లా అధ్యక్షులు కంది త్రినాథరావు, మాట్లాడారు. ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ సౌహార్ధ సందేశం ఇచ్చారు, అనంతరం నూతన కమిటీ ఎన్నికైంది. అధ్యక్షులుగా జనార్ధన, కార్యదర్శిగా కంధి త్రినాథ్‌తోపాటు 13 మందిని ఎన్నుకున్నారు. రాజు, ఎర్రిబాబు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు వీడాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రధాని నరేంద్ర మోడీ ఇకపై ప్రజా వ్యతిరేక విధానాలు విడిచి పెట్టాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రమేష్ కుమార్ కోరారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 5న మణిపూర్‌లో జరిగిన సంఘటన దేశానికే సిగ్గుచేటన్నారు. ఎక్కడ చూసినా దుర్మార్గమైన పాలన నడుస్తోందన్నారు. సుప్రీంకోర్టు స్టేతో రాహుల్ గాంధీ లోక్‌సభలో అడుగుపెట్టి ప్రజా సమస్యలపై గళం విప్పుతారని చెప్పారు. అనంతరం రాహుల్ గాంధీ సస్పెన్షన్‌పై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడంతో మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన పలువురు ముస్లిములు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిని రమేష్‌కుమార్, పట్టణ అధ్యక్షులు సుంకర సతీష్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంహెచ్ షరీఫ్, అప్పారావు, సూరిబాబు, ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో మెరుగైన సౌకర్యాలు

నాణ్యమైన ఆహారం అందించడమే లక్ష్యం ● ప్రజాశక్తితో జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి యశోదనరావు ముఖాముఖి



ప్రభుత్వ వసతిగృహాల్లోని విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు, నాణ్యమైన విద్య, భోజనం అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి ఎం.యశోదనరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వసతిగృహ విద్యార్థులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెంచిన మెస్, కాస్మోటిక్స్ ఛార్జీలు అమల్లోకి వచ్చిన తర్వాత మరింత నాణ్యమైన భోజనం, సౌకర్యాలు కల్పించేందుకు అవకాశం లభించిందన్నారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. బిసి సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్న సేవలు, కల్పిస్తున్న సౌకర్యాలు గురించి వివరించారు.

\- ప్రజాశక్తి, విజయనగరం టౌన్

జిల్లాలో బిసి సంక్షేమ శాఖ వసతిగృహాలెన్ని? విద్యార్థుల చేరిక ఎలా ఉంది?.

జిల్లాలో ప్రీమెట్రిక్ వసతిగృహాలు 38 ఉన్నాయి. వాటిలో 31 బాలుర వసతిగృహాలు, 7 బాలికల హాస్టళ్లు ఉన్నాయి. 2259మంది విద్యార్థులున్నారు. పోస్టుమెట్రిక్ వసతిగృహాలు 15 ఉన్నాయి. వాటిలో 8 బాలుర, 7 బాలికల వసతిగృహాలుండగా, 1600 మంది విద్యార్థులున్నారు. జిల్లాలో ఉన్న ప్రీమెట్రిక్ వసతిగృహాల్లో 27 ప్రభుత్వ భవనాలు ఉన్నాయి. 11 చోట్ల అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. పోస్టుమెట్రిక్ వసతిగృహాల్లో ప్రభుత్వ భవనాలు 5, అద్దె భవనాలు 10 ఉన్నాయి. నాడు-నేడు కార్యక్రమం ద్వారా నిధులకు ప్రతిపాదనలు పంపించాం. ధర్మవరం, బొబ్బిలి, భోగాపురం, అలుగోలు, చీపురుపల్లి ఇంటిగ్రేటెడ్, కలవచర్ల, కొత్తవలస, చీపురుపల్లి, బిపిపురం, బొప్ప, ఎంఎస్‌ఆర్, దత్తిరాజేరు, రావాడ, బాడంగి వసతిగృహాలకు ప్రతిపాదనలు పంపించాం. మరుగుదొడ్లు, తాగునీటి వంటి వాటి కోసం కూడా ప్రతిపాదనలు పంపాం.

వసతిగృహాల నిర్వహణలో మెరుగుదల కోసం తీసుకుంటున్న చర్యలు ఏమిటి?.

జిల్లాలో ఇప్పటికే వసతిగృహాలకు ఏ అవసరాలు ఉన్నాయో తెలుసుకొని వాటికి ప్రతిపాదనలు తయారు చేసి పంపించాం. సిపిఒ ద్వారా కలెక్టర్‌కి నివేదిక అందించాం. వసతిగృహాలను పరిశుభ్రంగా ఉంచేందుకు, విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులూ పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

వర్షాకాలం నేపథ్యంలో అంటురోగాల బారిన పడకుండా తీసుకున్న చర్యలేమిటి?.

అన్ని వసతిగృహాల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉన్నాయి. వారంలో ఒకసారి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల ద్వారా వైద్యపరీక్షలు చేయిస్తున్నాం. అనారోగ్య పరిస్థితులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించాం. సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉన్నారు. విద్యార్థుల ఆరోగ్య విషయాలు ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు తెలియజేస్తున్నాం.

మెస్‌ఛార్జీలు ఎంతవరకు పెరిగాయి?.

ప్రస్తుతం 3 నుంచి 5వ తరగతి వరకు రూ.వెయ్యి ఉంటే రూ.1150కు పెంచారు. 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు రూ.1250 నుంచి రూ.1400కు, కళాశాల విద్యార్థులకు రూ.1600కు పెంచారు. కాస్మోటిక్స్ ఛార్జీలు కూడా పెంచారు. ఇవి కూడా జూన్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. 3 నుంచి 5వ తరగతి వరకు బాలురకు రూ.100 నుంచి 125కు, బాలికలకు రూ.110 నుంచి 130కు, 6 నుంచి పదో తరగతి వరకు బాలురకు రూ.125 నుంచి 150కి, బాలికలకు రూ.160 నుంచి 200కు పెంచారు. కళాశాల విద్యార్థులకు బాలురకు రూ.125 నుంచి 200, బాలికలకు రూ.160 నుంచి 250కి పెంచారు. వీటితోపాటు తల కటింగ్ ఛార్జీలు రూ.30 నుంచి 50కి పెరిగాయి.

పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను ఎలా సన్నద్ధం చేస్తున్నారు?

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఈ ఏడాది బిసి సంక్షేమ వసతిగృహాల నుంచి సుమారుగా 350 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. గత ఏడాది 84 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది ఇంకా మంచి ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాం. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే కాకుండా వసతిగృహాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చదివిస్తున్నాం.

జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పరిస్థితి ఏమిటి?.

జిల్లాలో జగనన్న విద్య, వసతిదీవెన పథకాల ద్వారా ఈ విద్యా సంవత్సరంలో 40,669 మంది విద్యార్థులకు రూ.129.86 కోట్లు, 2838 మంది ఇబిసి విద్యార్థులకు రూ.8.45 కోట్లు, వెయ్యి మంది కాపు విద్యార్థులకు రూ.2.96 కోట్లతో ప్రతిపాదించాం.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని పింప్రంగివలస ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొని కథల పుస్తకాలు చదవడం వల్ల కలిగే ప్రయోజనాలను గురించి తెలుసుకున్నారు. కంప్యూటర్ బేసిక్స్ పిల్లలకు నేర్పుకున్నారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ మండలంలో ఉన్న పిల్లలందరూ ప్రతీ ఆదివారం నిర్వహించే చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి నష్టం

బొబ్బిలి: ప్లాస్టిక్ సంచుల వినియోగంతో పర్యావరణానికి నష్టమని గ్రీన్ బెల్ట్ అధ్యక్షులు ఎవివి రమణమూర్తి, సభ్యులు సిహెచ్ బాల భాస్కరరావు, ఎం.విజయమోహన్ అన్నారు. ప్లాస్టిక్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గ్రీన్ బెల్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకాళహరి పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్లాస్టిక్ సంచులను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులు, బాటిల్స్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్లాస్టిక్ వినియోగిస్తే రోడ్లు, కాలువలలో పడేయకుండా పారిశుధ్య కార్మికులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో గ్రీన్ బెల్ట్ సభ్యులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ బాగు చేయండి

బొబ్బిలి: సెంట్రల్ లైటింగ్ బాగు చేయాలని పిసిసి సభ్యులు ముమ్మల శ్రీనివాసరావు అన్నారు. రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి జ్యూట్ మిల్లు వరకు సెంట్రల్ లైటింగ్ లైట్లు వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారం రోజులు క్రితం బాగు చేసినప్పటికీ మరల పాడైపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి లైట్లు బాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మల్లమ్మపేటలో తల్లిపాల వారోత్సవాలు


బొబ్బిలి: మున్సిపాలిటీలోని మల్లమ్మపేట 22, 23 వార్డులలో ఆదివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఒ ఆర్.విజయలక్ష్మి మాట్లాడుతూ తల్లిపాలతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. పిల్లలకు తప్పనిసరిగా తల్లిపాలు తాగించాలని కోరారు. బిడ్డకు జన్మనిచ్చిన వెంటనే ముర్రుపాలు తాగించాలని కోరారు. ముర్రుపాలతో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్స్, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

ఎంపిడిఒపై చర్యలు తీసుకోవాలి

వేపాడ: స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ఉన్న తుప్పలు, డొంకలను తొలగించకుండానే తొలగించినట్లు కలెక్టర్కు తప్పుడు నివేదిక ఇచ్చిన ఎంపిడిఒ పట్నాయక్పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం టిడిపి బృందం ఆ వసతిగృహాన్ని పరిశీలించారు. వెంటనే పిచ్చిమొక్కలను తొలగించాలని కోరారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఇన్ని తుప్పల్లో ఎన్ని పాములుంటాయో ఇక్కడ నివసిస్తే మీకు తెలుస్తోందని ఎంపిడిఒను ఉద్దేశించి అన్నారు. ప్రజాశక్తిలో వెలువడిన కథనాన్ని చూసి తాము పరిశీలనకు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం టిడిపి మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, మండల మహిళా సంఘాల ఆర్గనైజింగ్ సెక్రటరీ గొంప ఈశ్వరి, గొర్లె నాగరాజు, వసతిగృహం విద్యా కమిటీ చైర్మన్ ఈశ్వర్ రావు, రాము నాయుడు, సిహెచ్ దేవుడు తదితరులు పాల్గొన్నారు.

సంతాప సభల్లో ఎమ్మెల్యే

డెంకాడ: మండలంలోని పెద్ద తాడివాడ ఎంపిటిసి పొంతపల్లి జగన్నధరావు తండ్రి, మోదవలసకు చెందిన వైసిపి మండల స్థాయి నాయకులు కెట్టు రెస్టారెంట్ యజమాని తండ్రి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. వీరిద్దరికి సంబంధించి ఆదివారం ఆయా గ్రామాల్లో పెద్దకర్మ, సంతాప సభలు జరిగాయి. ఈ సభలకు నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్బాబు, ఎంపిపి వాసుదేవరావు, వైఎస్ ఎంపిపి తమ్మినాయుడు హాజరై వారితో ఉన్న సంబంధాలను గుర్తుచేసుకున్నారు.


సంతాపం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

చీపురుపల్లి: ప్రతి ఒక్కరూ చెట్లు నాటాలని ఆకుల సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ అన్నారు. స్థానిక జి.వి.ఆర్ కాలేజ్ గ్రౌండ్ ఆవరణలో ఆకుల యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం సందర్భంగా గ్రీన్ ఛాలెంజ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మొక్కలు నాటారు. రెడ్డి రమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద చెట్లు నాటడంతో పాటు తమ ఊర్లను పచ్చదనంతో నింపడమే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. ప్రకృతిని కాపాడుకోని తద్వారా కాలుష్యం నివారించగలమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆకుల సంస్థ సభ్యులు రామకృష్ణ, చంటి, లక్ష్మణ, లోకేష్, గణేష్, రమణ, యువత పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి రోషిణి ఎంపిక

శృంగవరపుకోట: ట్రిపుల్ ఐటి ఫలితాల్లో భవాని నగర్లోని శ్రీ గౌరీ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్కి చెందిన మహమ్మద్ రోషిని సీట్ సాధించింది. వరుసగా రెండవ సంవత్సరం కూడా ట్రిపుల్ ఐటీ సీట్ను కైవసం చేసుకోవడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాండ్రేగుల వెంకటరాము, అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

మణిపూర్ ఘటనపై శాంతి ర్యాలీ

కొత్తవలస: మణిపూర్ ఘటనపై మండల క్రైస్తవ ఐక్య సమాజం, ముస్లింలు, భీమ్సేన ఆర్మీ, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. కొత్తవలస రైల్వే స్టేషన్ నుంచి అంబేద్కర్ జంక్షన్ మీదుగా కొత్తవలస హైస్కూల్ వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ మణిపూర్లో మహిళలపై దాడులు చేయడం విచారకరమన్నారు. మణిపూర్లో మానవ హక్కులను కాపాడాలని, క్రైస్తవులను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఫెలోషిప్ నాయకులు, భీమ్సేన ఆర్మీ నాయకులు, దళిత సంఘాల నాయకులు, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్ మృతికి సంతాపం

కొత్తవలస: ప్రజా గాయకుడు గద్దర్ మృతి పట్ల కొత్తవలస బార్ అసోసియేషన్ న్యాయవాదులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గద్దర్ నిబద్ధత, సంకల్పం అనేక తరాలకు ప్రేరణగా నిలిచాయన్నారు. అణచివేత శక్తులను సవాలు చేయడంలో ఆయన నిర్భయ చర్యలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన ఉద్వేగభరితమైన ప్రసంగాలు తెలంగాణ ప్రజల సామూహిక చైతన్యంపై ప్రభావం చూపాయన్నారు. అతని త్యాగాలకు, అతను సాహసోపేతంగా చేసిన పోరాటాలకు నివాళులు అర్పించడం చాలా ముఖ్యమన్నారు. గద్దర్ ఆత్మకు శాశ్వత శాంతి కలగాలని కోరారు.

ఎందుకీ ఉదాసీనత

- గంజాయి, బెల్ట్ షాపులు నివారణలో విఫలం
- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- పశువులు అక్రమ రవాణా నివారణపైనా నిర్లక్ష్యం
- ఒకే సామాజిక తరగతికి కొమ్ముకాస్తున్న పోలీసులు


గంజాయితో పట్టుబడ్డ సాధువు

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలిలో అసాంఘిక వ్యాపారాలు, కార్యకలాపాలు నివారించడంలో పోలీసులు పూర్తిగా విఫలమవుతున్నారు. శాంతిభద్రతలను కాపాడడంతో పాటు అసాంఘిక వ్యాపారాలు, కార్యకలాపాలు నివారించాల్సిన బాధ్యత పోలీసులపై ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. బెల్ట్ షాపులు నివారణ, ఇసుక అక్రమ రవాణా నివారణ, గంజాయి నివారణలో పోలీస్ యంత్రాంగం పూర్తిగా విఫలమవుతుందని తెలిస్తోంది. బొబ్బిలి మీదుగా అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకోవడంలో కూడా పోలీసులు విఫలం చెందుతున్నారని చర్చ జరుగుతుంది. పోలీసు స్టేషన్లో ఒకే సామాజిక వర్గానికి కొమ్ము కాస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

గంజాయి, బెల్ట్ షాపులు నివారణలో విఫలం

బొబ్బిలి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్ షాపులు, గంజాయి నివారణలో పోలీసులు విఫలం చెందుతున్నారు. ఒక స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ బెల్ట్ షాపులకు అక్రమంగా తరలిస్తున్న మద్యంపై దాడి చేసి మద్యాన్ని పట్టుకుని వందల సంఖ్యలో మద్యం సీసాలు సీజ్ చేస్తే పోలీసు స్టేషన్లో పని చేస్తున్న సిబ్బంది మాత్రం తూతూ మంత్రంగా దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గంజాయి కేసులలో కూడా పోలీసులు ఉదాసీనతగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్, గంజాయి కోసం జిల్లా ఎస్పి నియమించిన ఒక కానిస్టేబుల్ కలిసి మూడు గంజాయి కేసులను పట్టుకున్నారు. రైల్వే పై ఓవర్ బ్రిడ్జి వద్ద అక్రమంగా గంజాయి అమ్ముతున్న ఒక సాధువు నుంచి 750 గ్రాముల గంజాయి పట్టుకుని సీజ్ చేశారు. రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఒక యువకుడు నుంచి ఒక కిలో 700 గ్రాముల గంజాయి పట్టుకుని ఆయువకుడుపై కేసు నమోదు చేశారు. టిఆర్ కాలనీకు చెందిన ఒక మహిళ నుంచి మూడు గంజాయి పొట్లాలు స్వాధీనం చేసుకున్నారు. ఒక స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ మూడు బెల్ట్ షాపులకు తరలిస్తున్న మద్యాన్ని సీజ్ చేసి పోలీసు స్టేషన్ కు అప్పగిస్తే ఒక సిఐ, ముగ్గురు ఎస్సైలు, పదులు సంఖ్యలో కానిస్టేబుల్స్ వుండే పోలీసు స్టేషన్ సిబ్బంది ఎన్ని కేసులు నమోదు చేయవచ్చునో అర్థం చేసుకోవచ్చును. ఇద్దరు కానిస్టేబుల్స్ మూడు గంజాయి కేసులను పట్టుకుంటే పోలీసు స్టేషన్ సిబ్బంది ఒక కేసు కూడా పట్టుకోకపోవడం విశేషం. బెల్ట్ షాపులు నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గంజాయి అమ్మకాలను నివారించకపోవడంలో విఫలం కావడంతో గ్రామాల్లో కూడా గంజాయి తాగుతున్న వారి సంఖ్య పెరుగుతుందని విమర్శలు వస్తున్నాయి. గంజాయి నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ పట్టుకున్న మద్యం సీసాలు

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

ఇసుక అక్రమ తవ్వకాలపై సుప్రీంకోర్టు నిషేధం ప్రకటించినా బొబ్బిలిలో అమలు కావడం లేదు. బొబ్బిలి మండలంలోని అలజంగి, పారాది, పెంట వేగావతినది రేవులు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. ప్రతిరోజు వందల సంఖ్యలో ట్రాక్టర్ల లోడులు ఇసుక అక్రమంగా తరలిపోతున్నా పోలీసులు, ఎస్.ఇ.బి పోలీసులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. తూతూ మంత్రంగా నెలకొకసారి ఇసుక అక్రమ రవాణాపై దాడి చేసి కేసులు నమోదు చేస్తున్నారు తప్ప చిత్తశుద్ధితో ఇసుక అక్రమ రవాణా నివారించడం లేదని చర్చ జరుగుతుంది. ఇసుక అక్రమ రవాణాపై చర్యలు లేకపోవడంతో మండలంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతుంది.

పశువులు అక్రమ రవాణా నివారణపై నిర్లక్ష్యం


పశువులు అక్రమ రవాణాలో పోలీసులు విఫలం చెందుతున్నారు. గతేడాదిలో గొర్లెసీతారాంపురం వద్ద పశువులు తరలించే వ్యాన్ బోల్తా పడడంతో పదులు సంఖ్యలో ఆవులు మరణించాయి. పశువులు అక్రమ రవాణా బయట పడినప్పటికి తర్వాత నుంచి పట్టించుకోలేదు. దీంతో పశువుల అక్రమ రవాణాకు హద్దే లేకుండా పోయింది. గతనెల 24న అక్రమంగా పశువులు తరలిస్తున్న వ్యాన్ ఢీకొని ఒక వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వ్యాన్లో పశువులు అక్రమ రవాణా చేయడంతో మితిమీరిన వేగంతో వ్యాన్ వెళ్లడంతో ప్రమాదం జరిగింది. అక్రమ పశువులు రవాణా చేస్తున్న వాహనాలు ప్రమాదం కొన్నేళ్ల క్రితం పాతబొబ్బిలి వద్ద, గతేడాది గొర్లెసీతారాంపురం, గతనెల 24న ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో జరిగినా పశువులు అక్రమ రవాణా నివారణకు చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా పశువులు అక్రమ రవాణా నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఒకే సామాజిక తరగతికి కొమ్ము కాస్తున్నారని విమర్శలు

పోలీసు స్టేషన్లో ఒకే సామాజిక వర్గానికి పోలీసులు కొమ్ము కాస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పోలీసు స్టేషన్లో అన్ని సామాజిక వర్గాలను ఒకేలా చూడాల్సి ఉన్నప్పటికీ బొబ్బిలి పోలీసు స్టేషన్లో ఒకే సామాజిక వర్గానికి న్యాయం జరుగుతుందని పలువురు విమర్శిస్తున్నారు. అధికార పార్టీ నేతలకు, ఒకే సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. అందరిని ఒకేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

గంజాయి మత్తులో నేరాలు

గంజాయి వ్యసనానికి అలవాటు పడ్డ యువకులు నేరాలకు పాల్పడుతున్నారు. బొబ్బిలిలో వారం రోజులు క్రితం రెండు పాన్ షాపులలో చోరీ జరిగింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో షాపులలో చోరీ జరుగుతున్నా బయట పడడం లేదు. వ్యసనాలకు బానిసైన యువకులే నేరాలకు పాల్పడుతున్నట్లు చర్చ జరుగుతుంది. వారం రోజులు క్రితం పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం మరిపివలసలో బొబ్బిలికి చెందిన ఇద్దరు యువకులు ఒక ఆలయంలో గంజాయి తాగి అదే ఆలయంలో వెండి సామగ్రి చోరీకి పాల్పడ్డారు. గంజాయి మత్తులో చోరీ చేసిన యువకులను గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గంజాయి, మద్యం విచ్చలవిడిగా అమ్మకాలు జరగడం వల్లనే చోరీలు పెరిగిపోతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మద్యం, గంజాయి నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


వ్యాన్లో అక్రమంగా తరలిస్తున్న పశువులు

పంచాయతీ కాలువ ఆక్రమణ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని హోటల్ ముంతాజ్ ఎదురుగా పంచాయతీ కాలువను, రాస్తాను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ విషయమై స్థానికులు పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు తూతూ మంత్రంగా చర్యలు తీసుకోవడంతో ఆక్రమణదారులు కాలువను, రాస్తాను ఆక్రమించి కట్టడాలను మరింత వేగవంతం చేశారు. ఈ నిర్మాణం పూర్తయితే స్థానికంగా ఉంటున్న గృహాల నుంచి వచ్చే వాడుక నీరు పోయేందుకు అవకాశం లేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి కాలువకు, రాస్తాకు పంచాయితీ అధికారులు మార్కింగ్ చేసినప్పటికీ ఆ తర్వాత ఆక్రమణదారులు వాటిని తొలగించి నిర్మాణాలు చేపడుతున్న పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకనైనా వెంటనే అధికారులు స్పందించి కాలువను, రాస్తాను ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటారని స్థానికులు కోరుతున్నారు. లేకుంటే ఈ విషయమై సోమవారం స్పందన గ్రీవెన్స్లో ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు. ఈ విషయమై పంచాయతీ ఇంచార్జ్ ఈవో శ్రీనివాసులు వివరణ కోరగా ఫిర్యాదు అందిన మాట వాస్తవమేనని పంచాయతీ సిబ్బంది వెళ్లి ప్రభుత్వ స్థలం మార్కింగ్ చేసినప్పటికీ ఆక్రమదారులు నిబంధనలు అతిక్రమిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.


ఆక్రమణ స్థలంలో జరుగుతున్న నిర్మాణాలు

'రోడ్డు బాగుచేసే పరిస్థితిలో ప్రభుత్వం లేదు'

ప్రజాశక్తి - కొత్తవలస

మరమ్మతులకు గురైన రోడ్లను కూడా బాగు చేసే పరిస్థితిలో ప్రభుత్వం లేదని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఎద్దేవా చేశారు. మండలంలోని తుమ్మికాపల్లి గ్రామం మీదుగా దేవరాపల్లికి వెళ్లే తారు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఈ రోడ్డును ఆదివారం ఆమె పరిశీలించి ప్రభుత్వానికి సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. వైసిపి నాలుగేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలకు కళ్లబొల్లి బూటకపు మాటలు చెప్పి కాలయాపన చేస్తూ వచ్చారే తప్ప కనీసం రోడ్లను కూడా బాగుచేయలేక పోయారన్నారు. ఈ మార్గంలో ప్రధాన రోడ్లు మరీ అధ్వానంగా తయారైతే ప్రజలు, వాహనదారులు రాకపోకలు ఎలా కొనసాగిస్తాన్నారని ఆమె ప్రశ్నించారు. వీలైనంత త్వరగా రోడ్డులో పడిన గుంతలను పూడ్చాలని నియోజకవర్గ ప్రజాప్రతినిధులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, టిడిపి రాష్ట్ర అయ్యారక సాధికార సమితి కన్వీనర్ బంగారు రమేష్, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి కోళ్ల వెంకటరమణ (శ్రీను), కొత్తవలస మండలం పార్టీ ప్రధాన కార్యదర్శి కనకాల శివ, సీనియర్ నాయకులు లాలం అర్జునరావు, గొంప దుర్గా ఉమేష్, యువత గొంప రాంబాబు, గొర్లె కిరణ్ కుమార్, సిరిమెళ్ళ పైడిరాజు, ఉగ్గిన రమణ, ముమ్మన సూరిబాబు, ఇరోతి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


మరమ్మతుకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న కోళ్ల

అలరించిన ఫ్రీ బ్యాగ్ డే సంబరాలు

ప్రజాశక్తి- మెరక ముడిదాం

మండల కేంద్రంలో ఉన్న సన్ రైజ్ పాఠశాలలోని ఆదివారం నిర్వహించిన ఫ్రీ -బ్యాగ్ డే సంబరాలు అలరించాయి. ఈ సంబరాలులో విద్యార్థులు ఆపిల్ విశిష్టత, ఉపయోగాలను వివిధ రకాల చిత్ర పటాలు ద్వారా ప్రదర్శించారు. వీటిని తిలకించిన విద్యార్థుల తల్లి తండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ కుమారి మాట్లాడుతూ పిల్లలలో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మకను వెలికి తీయటానికి ఇటువంటి ఫ్రీ -బ్యాగ్ డే సంబరాలు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. తమ పాఠశాలలో విద్యార్థులకు ఆడుతూ, పాడుతూ చిత్ర లేఖనం ద్వారా భోధన చేస్తున్నామన్నారు. ఇటువంటి బోధన చేయటం వల్ల మండలంలోని పలు ప్రాంతాల నుండి తల్లి తండ్రులు తమ పిల్లలను ఈ పాఠశాలలో చేర్పించటానికి మక్కువ చూపుతున్నారని చెప్పారు. పైగా పాఠశాల పరిసరాలు ఆకర్షనీయంగా ఉండటం, పిల్లలు ఆడుకోవటానికి అనేక ఆట వస్తువులు ఉండటం, మైన్ రోడ్కు అనువుగా ఉండటం, ప్లే గ్రౌండ్ విశాలంగా ఉండటం, ట్రావిలింగ్ సదుపాయం కల్పించటం వల్ల అత్యధిక సంఖ్యలో విద్యార్థులు తరలి వస్తున్నారన్నారు.


ఫ్రీ బ్యాగ్ డేలో పాల్గొన్న పిల్లలు, ఉపాధ్యాయులు

స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం అనే పాటను గుర్తు చేసుకుంటూ చిన్ననాటి స్నేహితులు స్నేహితుల దినోత్సవ వేడుకలను ఎస్.కోటలోని మహాత్మాగాంధీ పార్కులో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఫ్రెండ్ షిప్ బాండ్లను ఒకరి చేతికొకరు కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎపిఎన్జిఒ జిల్లా కోశాధికారి ఎస్.వి. సుధాకర్ మాట్లాడుతూ మనం కష్టాల్లో ఉన్న సమయాల్లో బంధువులు కన్నా స్నేహితులే ఆదుకునేందుకు ముందుకు వస్తారన్నారు. అదే స్నేహితుల గొప్ప తనమని స్పష్టం చేశారు. కాగా బాల్యం నుంచి స్నేహితులుగా కొనసాగుతున్న షేక్ ముక్తుమ్, మాజీ వార్డు సభ్యులు ఎం.దుర్గారావు, రిటైర్డ్ మిలిటరీ ఉద్యోగి రాంబాబు, న్యాయవాది గుమస్తా బెల్లంకొండ కృష్ణ, టిడిపి నేత పిరిడి సింహాచలం తదితరులు శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

బొబ్బిలి: స్నేహాన్ని ఎప్పటికి మరువకూడదని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జేసీ రాజు, వి.శ్రీహరి అన్నారు. పట్టణంలో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఆదుకోవడమే నిజమైన స్నేహమన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షులు జి. శ్రీనివాసరావు, కోశాధికారి శ్రీనివాస్, చంద్రకిషోర్, రామకష్ణ పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని పలు గ్రామాల్లో స్నేహితుల దినోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. పలువురు స్నేహితులు ఒకే చోట కలుసుకుని చేతికి ఫ్రెండ్షిప్ బ్యాండేజీలు కట్టుకుని మిఠాయిలు పంచి పెట్టుకున్నారు. ఆపదలో వచ్చి ఆదుకున్న వాడే స్నేహితులను పైడిరాజు అన్నారు.

విక్రయ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని టెక్కలిలో ఆదివారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ వనరుల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చీపురుపల్లి సబ్ డివిజన్ ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ బి. సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామంలో అన్ని రకాల పంటలకు అవసరమైన కషాయాలను ముందుగానే అంచనా వేసి వాటిని తయారు చేసి రైతులకు అమ్మడానికి సిద్ధంగా ఉంచాలన్నారు. రైతులందరూ పెరుగుతున్న పెట్టుబడులను, అనారోగ్యాలను దృష్టిలో పెట్టుకుని రసాయనాలు తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి మంచి ఫలితాలు పొందాలని సూచించారు. సిబ్బంది మజ్జి శాంతి మాట్లాడుతూ తమ గ్రామంలో ప్రకృతి వనరుల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించడం మంచి పరిణామమని రైతులందరూ సేవలను సక్రమంగా ఉపయోగించుకుని మంచి ఫలితాలను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, మహిళ సంఘాల సభ్యులు, మండల యాంకర్ వర్రి గాయత్రి, ఐసిఆర్పిలు రామలక్ష్మీ, కృష్ణంనాయుడు, దుర్గారావు పాల్గొన్నారు.


కషాయాలను తయారు చేస్తున్న సిబ్బంది

సెంచూరియన్ సందర్శన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఆస్ట్రేలియాకు చెందిన పర్యావరణ ఇంజనీర్ బెతాని జార్జ్ ఆదివారం సెంచూరియన్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా 'నాక్'కు సన్నద్ధమవుతున్న తరుణంలో సెంచూరియన్ విద్యాపరంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించడం ఎలా? అనే అంశాలపై ఆమె వివరించారు. ఈ సందర్భంగా విసి ప్రొఫెసర్ పి.కె.మహంతితో భేటి అయ్యారు. అనంతరం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు సంబంధించి ఏయే చర్యలు చేపట్టారు? ఇంకా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలనే అంశా లను వివరించారు. అనంతరం ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్వర్మ, డీన్ డాక్టర్ సన్నీ డియోల్ పాల్గొన్నారు.

ఓల్డేజ్ హోం నిర్మాణమే లక్ష్యం

కొత్తవలస: ఒంటరి వృద్ధుల కోసం రానున్న రోజుల్లో ఓల్డేజ్ హోమ్ నిర్మాణం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విశ్వనాథ హరికుమార్ తెలిపారు. మండలంలోని తుమ్మికాపల్లిలో శ్రీ సత్యసాయి ట్రస్ట్ యూనివర్సల్ వెల్ఫేర్ సహకారంతో 38 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యవసర సరుకులు ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి శ్రీ సత్యసాయి ట్రస్ట్ రామ్మూర్తి, డాక్టర్ సంతోష్, నాయుడు, ఫర్ ది పీపుల్ ట్రస్ట్ జాయింట్ సెక్రెటరీ డాక్టర్ రవి, పాల్గొని మాట్లాడారు. ఒంటరి వృద్ధులకు సహాయం అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సహాయం చేయాలని హరి చేస్తున్న సేవలు మరువలేనివని, చిన్న వయసులో మంచి సేవా కార్యక్రమాలు చేస్తూ అందరి మన్ననలు పొందడం గొప్ప విషయమని అన్నారు. ట్రస్ట్ చైర్మన్ విశ్వనాధ హరి కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రస్టులో చేరాలని ఒకరు చేరడం వల్ల ఒక వృద్ధురాలకు ఆకలి తీర్చే వారు అవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే రిటైర్డ్ ఎంప్లాయ్ రమణ, ట్రస్ట్ ట్రెజరర్ శ్రావణ్ కుమార్, సభ్యులు గోవిందరావు, వరం పట్నాల, నగేష్, తేజ తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో మంగళ వారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఇంచార్జి ప్రిన్సిపాల్ కె.యుగంధర్ తెలిపారు. జాబ్ మేళాతో పాటు అప్రంటీస్ మేళా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఐటిఐలో ఏదైనా ట్రేడ్లో ఉత్తీర్ణత సాధించి 25 ఏళ్లలోపు ఉన్న విద్యార్థులు అర్హులన్నారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్స్తో జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు 9493001884ను సంప్రదించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని చామలాపల్లి గ్రామంలో మధ్యాహ్నం వంట గ్యాస్ లీక్ అవ్వడంతో పూరిపాక దగ్ధమైంది. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం ఈ మేరకు మీగడ లక్ష్మీకాంతంకు చెందిన పూరి గుడెసె పూర్తిగా ధగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న రూ. 80వేలు నగదు, రెండు తులాల బంగారం కాలి బూడిదైపోయిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తుంది. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

18 మంది అరెస్టు

ప్రజాశక్తి- గుర్ల

మండలంలోని గరికివలస గ్రామంలో 18 మంది జూదరలను అరెస్టు చేసినట్లు ఎస్ఐ హరిబాబునాయుడు తెలిపారు. గ్రామంలో పేకాడుతున్నట్లు తమకువచ్చిన సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామని చెప్పారు. వారి వద్ద నుంచి రూ. 1,01,600 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని చెప్పారు. గ్రామాల్లో పేకాట, మద్యం విక్రయాలు వంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE, AT VIZIANAGARAM O.S.299/2016 (of Senior Civil Judge, Ramachandrapuram) E.P. 83/2018

Between:
Palivela Achibabu ....Decree Holder
And:
Bagadi Manikyam .....Judgment Debtor
To
Smt. Bagadi Manikyam, W/o Venkataramana, Aged 38 years, Hindu, Housewife, Residing at D.No. 22-10-183, Near Kata Veedhi, Ring Road, Vizianagaram.

NOTICE

Take notice that the Decree Holder filed the above E.P. for recovery of an amount of Rs. 16,17,556/- due under the decree dated 14-12-2017 by selling the stands posted to 24 to 24-08-2023 E.P. schedule property and the said E.P.83/2018 st for proclamation and sale under Order XXI, Rule 66(2) of C.P.C. If you got any objection for the sale of the E.P. schedule property you can appear in person or through an advocate and file your objections if any on **24-08-2023 at 10-30 A.M** in the above Court.

L.SATYANARAYANA.
Advocate for the Decree Holder
Vizianagaram

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM. F.D.I.No. 4/2022 in O.S.No.275/2017

Between:-
Sri Dharmana Rama Rao.....Plaintiff.
And:-
Smt. Siripurapu Madhuravani
....Defendant.

NOTICE TO THE RESPONDENT/DEFENDANT

Smt. Siripurapu Madhuravani, W/o Krishna, R/o Plot No.48 & 49, Sriram Nagar Colony, Dharmapuri Road, Vizianagaram.

Please take notice that the above matter stands posted to 28.08.2023 for the appearance of the respondent/defendant before the Honourable Court by 10.30 a.m. you fail to appear before the said Honourable court by **10.30 a.m., on 28.08.2023** in person or through an advocate, the above matter will be decided in your, absence and ex-parte.

CH.Damodar Rama Mohana Rao(Damu)
G. Appa Rao,
Advocates,
Advocate for the Petitioner/plaintiff.
Vizianagaram,
Cell No: 9393328926, 9052648232

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE VIZIANAGARAM S.O.P. 7/2023

Between:
1. Regidi Babji, S/o. late Ramu
2. Regidi Adilaskshmi, D/o. late Ramu
3. Pilli Simhachalam, W/o. late Pydiraju,
all are residing at Kondapeta Colony, Veduruvada Village, Bondpalli mandal, Vizianagaram district ....Petitioners
And:
- Nil - ....Respondent

NOTICE

ఇందలి పిటీషనర్లు లేటు రేగిడి రాము, S/o లేట్ ఆదియ్య మరియు రేగిడి రాము భార్య శ్రీమతి. లేటు రేగిడి సూర్యం వారసులుగా Succession Certificate జారీ చేయమని కోరుచూ పిటిషన్ సదరు కోర్టులో దాఖలు చేసినారు. కావున ఇందలి ఎవరికైనను ఆక్షేపణదారులు వున్న యెడల పై కోర్టు ఎదుట **తే 31-08-2023 దీ ఉదయం 10-30 గంటల**కు స్వయంగా గాని, లాయరు ద్వారాగాని హాజరై మీ వద్ద ఉన్న పత్రాలను దాఖలు చేయవలెను. లేనిచో వున్న ఆధారాల మేరకు పరోక్షంగాను శ్రీ కోర్టువారు తీర్పు చెప్పబడును అని తెలియజేయడమైనది.

బై కోర్టు ఆర్డరు

T. SANTHA KUMAR
V.NARASINGA RAO
Advocates,Vizianagaram
Cell: 7780528099

పబ్లికేషన్
మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, గజపతినగరం
O.S.116/2022

Between:
పూసపాటి పుష్ప మరియు వగైరాలు ...వాదులు
And:
పూసపాటి చంద్రమతి మరియు వగైరాలు ...ప్రతివాదులు
To:
D.5. బుద్ధరాజు సూర్యనారాయణ రాజు R/o Flot No.101, వసుద ఏన్క్లేవ్, P.S.R కోలనీ, 100 అడుగుల రోడ్డు, విజయనగరం
D.6. బుద్ధరాజు సుధీర్ S/o సూర్యనారాయణ రాజు, R/o Flot No.101, వసుద ఏన్క్లేవ్, P.S.R కోలనీ, 100 అడుగుల రోడ్డు, విజయనగరం.
D.7. బుద్ధరాజు సునీల్ S/o సూర్యనారాయణ రాజు, R/o Flot No.101, వసుద ఏన్క్లేవ్, P.S.R కోలనీ, 100 అడుగుల రోడ్డు, విజయనగరం

పై నెంబరుగల కోర్టు యందు వాదులు దావా నమోదు చెయ్యగా శ్రీ కోర్టువారు వాదులకు ఆర్డరు జారీచేసిన ప్రకారము పలుమార్లు నోటీసులు పంపించిననూ మీరు తీవ్ర జాప్యం చెయ్యడం వలన తిరస్కరించుట వలన తేది 28-8-2023 వాయిదా కలదని ఈ నోటీసు పత్రికా ముఖంగా మీకు తెలియజేమని శ్రీకోర్టువారు ఆర్డరు వేసియున్నారు. కావున వాయిదా రోజున అనగా **తేది 28-8-2023 ఉదయం గం॥ 10-30ని॥** మీరుగాని, మీ న్యాయవాదిగారి ద్వారా గాని పై కోర్టునకు హాజరై మీ వాదనను తెలియజేయవలెను. లేనియెడల శ్రీకోర్టువారు మీకు పరోక్షముగా తీర్మానించుదురని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

ఇట్లు
కె.రవిబాబు, అడ్వకేట్,
సెల్ : 9440343921

పబ్లికేషన్
మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, గజపతినగరం
IA 241/2022

Between:
పూసపాటి పుష్ప మరియు వగైరాలు ...వాదులు
And:
పూసపాటి చంద్రమతి మరియు వగైరాలు ...ప్రతివాదులు
To:
D.5. బుద్ధరాజు సూర్యనారాయణ రాజు R/o Flot No.101, వసుద ఏన్క్లేవ్, P.S.R కోలనీ, 100 అడుగుల రోడ్డు, విజయనగరం
D.6. బుద్ధరాజు సుధీర్ S/o సూర్యనారాయణ రాజు, R/o Flot No.101, వసుద ఏన్క్లేవ్, P.S.R కోలనీ, 100 అడుగుల రోడ్డు, విజయనగరం.
D.7. బుద్ధరాజు సునీల్ S/o సూర్యనారాయణ రాజు, R/o Flot No.101, వసుద ఏన్క్లేవ్, P.S.R కోలనీ, 100 అడుగుల రోడ్డు, విజయనగరం

పై నెంబరుగల కోర్టు యందు వాదులు దావా నమోదు చెయ్యగా శ్రీ కోర్టువారు వాదులకు ఆర్డరు జారీచేసిన ప్రకారము పలుమార్లు నోటీసులు పంపించిననూ మీరు తీవ్ర జాప్యం చెయ్యడం వలన తిరస్కరించుట వలన తేది 28-8-2023 వాయిదా కలదని ఈ నోటీసు పత్రికా ముఖంగా మీకు తెలియజేమని శ్రీకోర్టువారు ఆర్డరు వేసియున్నారు. కావున వాయిదా రోజున అనగా **తేది 28-8-2023 ఉదయం గం॥ 10-30ని॥** మీరుగాని, మీ న్యాయవాదిగారి ద్వారా గాని పై కోర్టునకు హాజరై మీ వాదనను తెలియజేయవలెను. లేనియెడల శ్రీకోర్టువారు మీకు పరోక్షముగా తీర్మానించుదురని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

ఇట్లు
కె.రవిబాబు, అడ్వకేట్,
సెల్ : 9440343921